సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 2 । మార్చి । 2023



శభాష్ వలంటీర్

కాకినాడలో వైద్య సేవలు పొందుతున్న యాట్ల నన్యాసమ్మకు గ్రామవలంటీర్ పెద భవాని పింఛను అందజేసింది. 8లో



విద్యార్థులకు వైద్య పరీక్షలు

తలార్‌సింగ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిచిన వైద్య శిబిరంలో 620 మందికి సేవలందించారు. 8లో



సమస్యలు పరిష్కరించండి

స్పందనలో స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

జి.మాడుగుల: టీటీడీ నిధులతో దేవదాయ, ధర్మదాయశాఖ సహకారంతో మండలంలో నాలుగు గ్రామాల్లో రామాలయాలు, శ్రీలక్ష్మీ గణపతి ఆలయాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. మండలంలో పెదలోచలి పంచాయతీ బొర్రతాడి, సొలభం పంచాయతీ సొలభం కాలనీ, వంతాల పంచాయతీ చింతగొంది, వేలంగరువు గ్రామాల్లో విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పరమహంస అధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున నాలుగు ఆలయాలకు రూ.40లక్షలు నిధులు వెచ్చించి నిర్మిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మప్రచారకులు రీమెలి అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో భజరంగదల్ జిల్లా నాయకులు కె.వెంకటరమణ, అప్పలనాయుడు, కె.రమణ మూర్తి, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ దేముళ్లనాయుడు పాల్గొన్నారు.

చింతపండుకు గిట్టుబాటు ధర

- జీసీసీ మేనేజర్ దుర్గాప్రసాద్



కొనుగోలును పరిశీలిస్తున్న మేనేజర్ దుర్గాప్రసాద్

అనంతగిరి : దళారులను గిరిజన రైతులు నమ్మిమోసపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని జీసీసీ మేనేజర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని డముకు, కాశీపట్నం వారపు సంతల్లో జీసీసీ చింతపండు కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. గిరి రైతులతో మాట్లాడారు. చింతపండును జీసీసీ గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తుందని వారికి అవగాహన కల్పించారు. అటవీ ఉత్పత్తులను జీసీసీకి విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

మావోయిస్టులకు దూరంగా ఉండాలి



యువతకు వాలీబాల్ కిట్లు, మందులు అందజేస్తున్న ఎస్‌ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు మావోయిస్టులకు దూరంగా ఉండాలని మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ సూచించారు. బూదరాళ్ల, ఎం.భీమవరం పంచాయతీలలో జెర్రిగొంది, పోకలపాలెం, కన్నవరం, కునుకూరు, నల్లబిల్లి, గోధుమలంక, రాజులపాడు, బొడ్డుమామిడి, ఊటంజల, మర్రిపాకలు గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు మావోయిస్టుల మూలంగా అభివృద్ధి ఆగిపోయిందన్నారు. గంజాయి పండించినా లేదా రవాణా చేసినా చట్టరీత్యా నేరమవుతుందన్నారు. మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, మందులు, పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

భూ రీసర్వేతో తగాదాలు పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



గాంకొండలో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, తహసీల్దార్

కొయ్యూరు: రైతుల పొలాల్లో గట్ల మధ్య ఉండే తగాదాలను సర్వేద్వారా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జె శివ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన గాంకొండ, శరభన్నపాలెం, గానుగుల ప్రాంతాల్లో భూముల రీసర్వేకు సంబంధించి నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా చోట్ల రైతుల పొలాల్లో గట్లు, సరిహద్దుల విషయంలో వివాదాలు వస్తుంటాయన్నారు. వీటిని సర్వే ద్వారా పరిష్కరించాలని సూచించారు. వెబ్‌ల్యాండ్, పట్టాల్లోని భూమి వివరాలను సరి చూసుకోవాలని కోరారు. కొన్నిచోట్ల తేడాలు వస్తున్న విషయాన్ని ఆయన వివరించారు. మ్యుటేషన్ల ద్వారా తప్పులు సరిదిద్దాలని సూచించారు. కొన్నిచోట్ల భూములు ఏళ్ల తరబడి ఒకరు సాగు చేస్తుంటే పట్టాలు మరొకరి పేరిట ఉంటాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మంపలోని అల్లూరి సీతారామరాజు స్మారక పార్క్‌ను సందర్శించారు స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించారు. తహసీల్దారు తిరుమలరావు, డీటీ, ఆర్‌ఐలు ఉన్నారు.



ఏయూ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదిక

పెట్టుబడుల సంబరానికి విశాఖ సిద్ధం

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు సర్వం సన్నద్ధం
- ఏయూ వేదికగా రేపటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు
- 26 దేశాల నుంచి 8 వేల మంది ప్రతినిధుల రాక
- రూ.100 కోట్లతో నగర సుందరీకరణ
- ఏపీ పెవిలియన్ పేరుతో 137 స్టాళ్లతో ఎగ్జిబిషన్
- వేదిక వద్ద ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

సాక్షి, విశాఖపట్నం: అడ్వాంటేజ్ ఏపీ పేరుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వనరులు, సౌకర్యాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు కోసం రూ.100 కోట్లతో విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మొత్తం 26 దేశాల నుంచి 5 వేల నుంచి 8 వేల మంది ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారని అంచనా వేస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానం వేదికగా 3, 4తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు 26 దేశాల నుంచి అతిథులు, పెట్టుబడిదారులు వస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు. అతిథుల కోసం నగరంలోని పలు హోటళ్లలో 750కి పైగా గదులను ఇప్పటికే కేటాయించారు. వీటితో పాటు మరో 1000 గదులను పలువురు ప్రతినిధులు బుక్ చేసుకున్నారు. అతిథులను ఆయా హోటళ్ల నుంచి ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు నోడల్ అధికారులు, ప్రత్యేక సిబ్బందిని కలెక్టర్ డా.మల్లికార్జున ఆధ్వర్యంలో నియమించారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద వైద్య బృందాలను సిద్ధం చేశారు. అతిథుల్లో కొందరు ప్రత్యేక విమానాల్లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. మరికొందరు ప్రత్యేక హెలికాప్టర్లలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి సీఎం వైఎస్ జగన్ కూడా హెలికాప్టర్‌లో సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై.. రెండో రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకు వేదిక వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ప్రధాన ద్వారం వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్

పెట్టుబడిదారులు వచ్చే ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో 40 డెస్కులు ఏర్పాటు చేసి.. వాటి పర్యవేక్షణకు నోడల్ అధికారులు, సిబ్బందిని నియమించారు. బుధవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే ప్రత్యేక కిట్ అందజేస్తున్నారు. అనంతరం వారికి కేటాయించిన స్టాల్, హాలు వివరాలను సంబంధిత సిబ్బంది వెల్లడిస్తున్నారు. ప్రధాన వేదికల్లో డెలిగేటెడ్ డైనింగ్ ఏరియాను దాదాపు 4 వేల మంది కూర్చొని భోజనం చేసే విధంగా ఏర్పాటు చేశారు. ప్రపంచ నలుమూలల నుంచి హాజరవుతున్న అతిథుల కోసం ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ఏపీ సంప్రదాయ వంటకాలను తయారు చేస్తున్నారు.

సీఎం, ప్రముఖులకు ప్రత్యేక వేదిక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రత్యేక వేదిక సిద్ధం చేశారు. మెయిన్ సెమినార్ హాలుకు అనుసంధానంగా ఈ వేదిక పనులు దాదాపు పూర్తయ్యాయి. సదస్సుకు సంబంధించిన వివరాలు అందించేందుకు వీలుగా సీఎం ఉండే వేదికలోనే మీడియా వ్యక్తులకు ప్రత్యేక చోటు కేటాయించనున్నారు. మీడియా బ్రీఫింగ్ కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికలో ప్రారంభోత్సవ, ముగింపు కార్యక్రమాలు, పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటితోపాటు మీడియా హాలులో వివిధ దేశాలకు చెందిన రాయబారులు, ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులతో మన రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై సెమినార్లు జరగనున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా ఏపీ పెవిలియన్

ప్రధాన సెమినార్ హాలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి రోజు ప్రసంగిస్తారు. సదస్సు ఉద్దేశాలను తెలుపుతూ ప్రారంభ ఉపన్యాసం చేసి మొదటి రోజు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఈ మేరకు మెయిన్ హాలులో సుందరీకరణ పనులు ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చేపట్టారు. మూడో హాలులో అన్ని రకాల కంపెనీలు, సదస్సులకు చెందిన సెమినార్లు నిర్వహించనున్నారు. సీఎంకి కేటాయించిన ప్రత్యేక వేదికకు సమీపంలో ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో మద్దిలపాలెం వైపు సుమారు 137 స్టాళ్లతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టు ఇండస్ట్రీలు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, ఏపీఐఐసీ పరిధిలో ఉండే పరిశ్రమలు, గ్రామ సచివాలయాలు, పాఠశాల విద్య, పట్టణ ప్రణాళిక, పంచాయతీ రాజ్, స్కిల్ డెవలప్‌మెంట్ మొదలైన అంశాలకు సంబంధించిన అంశాలు ప్రదర్శించనున్నారు. ఈ ఏపీ పెవిలియన్ సదస్సుకే హైలెట్‌గా నిలవనుంది.



వేదిక వద్ద సిద్ధమవుతున్న స్టాళ్లు



మొబైల్ టాయిలెట్లు

ఆయా హాళ్లలో సెషన్లు ఇలా...

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై సదస్సులు జరగనున్నాయి. వీటి కోసం ప్రధాన వేదికకు అనుబంధంగా సెమినార్ల నిర్వహణ కోసం ఓ ప్రత్యేక వేదికను నిర్మించారు.

తొలిరోజు

మార్చి 3 తొలి రోజున మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెమినార్లు జరగనున్నాయి. హాలు–1లో ఐటీ, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ,
ఎలక్ట్రానిక్స్ తదితర అంశాలపై , హాలు–2లో ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్స్, ఇన్నోవేషన్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ మొదలైన అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. హాలు–3లో పునరుత్పాదక ఇంధన వనరులు,, గ్రీన్ హైడ్రోజన్, హెల్త్‌కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, ఏరోస్పేస్–రక్షణ రంగాలపై సెమినార్లుంటాయి. మీడియా హాలులో తొలి రోజు నెదర్లాండ్స్, యూఏఈ దేశాల సదస్సులు జరగనున్నాయి.

రెండో రోజు

సదస్సు రెండో రోజైన మార్చి 4న ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సెషన్లుంటాయి. హాలు–1లో పెట్రోలియం–పెట్రో కెమికల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. హాలు–2లో ఉన్నత విద్య, టెక్స్‌టైల్స్–అపెరల్స్ తదితర అంశాలపై సెమినార్లు జరగనున్నాయి. హాలు–3లో టూరిజం– హస్పిటాలిటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. వీటితో పాటు మీడియా హాలులో వియత్నాం, వెస్టర్న్ ఆస్ట్రేలియా దేశాల సెమినార్లు జరుగుతాయి.

విశాఖ నగరానికి సీఎం జగన్

- నేటి సాయంత్రం 5.15 గంటలకు రాక
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరు



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం నుంచి మూడు రోజుల పాటు విశాఖలో ఉండనున్నారు. శుక్ర, శనివారాల్లో నగరంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో పాల్గొనున్నారు. ఆయన గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి గురువారం సాయంత్రం 5.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆరు గంటలకు రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు.

- శుక్రవారం ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు స్వాగతం పలుకుతారు. 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీఐఎస్ సదస్సులో పాల్గొంటారు. లంచ్ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిబిషన్ ఎరినాను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జీఐఎస్ ప్రతినిధులతో నిర్వహించే ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం హోటల్‌కు చేరుకొని సాయంత్రం 6.20 నుంచి 7.45 వరకు విశ్రాంతి తీసుకుంటారు. రాత్రి 8 నుంచి ఎంజీఎం పార్క్ హోటల్‌లో జీఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటుచేసిన ప్రత్యేక విందులో పాల్గొంటారు. అనంతరం హోటల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు.
- శనివారం ఉదయం 9.15 నుంచి 10.45 గంటల వరకు రెండో రోజు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగింపు సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 2.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. 2.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరుతారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి



ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న అరకు ఎంపీ మాధవి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- ఇరడాపల్లి, గొందెలి పంచాయతీల్లో ప్రచారం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్రలోని గిరిజనులకు మరింత మేలు జరుగుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరడాపల్లి, గొందెలి పంచాయతీల్లోని గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో పాటు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలంతా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిశారు. రాయిగెడ్డ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం,ఉపాధ్యాయులను కూడా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో అన్ని వర్గాల గిరిజనులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో పట్టభద్రులంతా గెలిపించాలన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్,ఎన్నికల ప్రచార మండల పరిశీలకుడు సతక బుల్లిబాబు మాట్లాడుతూ మన్యంలోని అన్ని వర్గాల పట్టభద్రులు గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్‌ను గెలిపించాలన్నారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తమర్బ వెంకటేశ్వరనాయుడు, సర్పంచ్ గల్లెలి అశ్విజ, ఎంపీటీసీ సత్యనారాయణ, మండల కన్వీనర్ కిముడు కోటిబాబు పాల్గొన్నారు.

పార్టీ బలపరిచిన అభ్యర్థి..

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ బలపరచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు.ఆమె స్వగ్రామం శరభన్నపాలెంలో బుధవారం సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను పార్టీ బలపరిచిందని తెలిపారు. పట్టభద్రులు అంతా మొదటి ప్రాధాన్యత ఓటును ఆయనకు వేయాలని కోరారు. సర్పంచ్ కిముడు సత్యనారాయణ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ పాల్గొన్నారు.



తొలిరోజు 75,188 మందికి పంపిణీ

- జిల్లాలో 60.42 శాతం మేర వైఎస్సార్ పింఛన్ల పంపిణీ
- ప్రథమస్థానంలో కూనవరం

-8లో

కాఫీ విపణిలో..మాక్స్ ఘుమఘుమ

- నాణ్యమైన ఉత్పత్తులు
- కొనుగోలుకు పోటీపడుతున్న వ్యాపారులు
- రైతుల భాగస్వామ్యంతో సంస్థ కార్యకలాపాలు



యార్డులో పాచ్‌మెంట్ కాఫీ గింజలను ఎండబెడుతున్న కార్మికులు

సాక్షి, పాడేరు : పాడేరు ఐటీడీఏ, డీసీసీబీ బ్యాంకు సహకారంతో ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ సొసైటీ కాఫీ వ్యాపారంలో సత్తా చాటుతోంది. చింతపల్లిలో పల్పింగ్ యూనిట్‌ను స్థాపించిన మాక్స్ సంస్థ గత ఏడాది నుంచి నాణ్యమైన కాఫీ గింజల తయారీలో ముందంజలో ఉంది. ఈ సంస్థకు సీనియర్ కాఫీ రైతు సెగ్గె కొండలరావు అధ్యక్షుడిగా ఉన్నారు. సుమారు 3,200 మంది గిరిజన కాఫీ రైతుల భాగస్వామ్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

పండ్ల దశలో కొనుగోలు

గిరి రైతుల నుంచి ఏటా కాఫీని పండ్ల దశలోనే కొనుగోలు చేసి, పల్పింగ్ చేపట్టి నాణ్యమైన పాచ్‌మెంట్ కాఫీ గింజలను ఉత్పత్తి చేస్తోంది. బహిరంగ వేలం ద్వారా అమ్మకాలు జరిపి, ఆ వచ్చిన లాభాలను కాఫీ రైతుల ఖాతాల్లో జమ చేస్తూ బాసటగా నిలుస్తోంది. చింతపల్లి మాక్స్ సంస్థ గత ఏడాది 1087 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను ఏజెన్సీ వ్యాప్తంగా కాఫీ రైతుల నుంచి మాక్స్ సంస్థ, ఐటీడీఏ సహకారంతో సేకరించింది.

గతేడాది కిలో రూ.32..

కిలో రూ.32 ధరతో కాఫీ పండ్లను సంస్థ కొనుగోలు చేసింది. పల్పింగ్ చేసిన తరువాత యార్డ్‌లో బాగా ఆరబెట్టిన తరువాత 179 మెట్రిక్ టన్నుల నాణ్యమైన పాచ్‌మెంట్ కాఫీ గింజలను సిద్ధం చేసింది. అలాగే పచ్చికాయలను ఎండబెట్టి 42 మెట్రిక్ టన్నుల మేర చెర్రీ గింజలను ఉత్పత్తి చేసింది. గత ఏడాది పాచ్‌మెంట్‌ను కిలో రూ.294, చెర్రీని రూ.116తో బహిరంగ వేలంలో విక్రయించింది. అన్ని ఖర్చుల పోను రూ.1.5 కోట్ల మేర లాభాలు వచ్చాయి. కాఫీ పండ్లను మాక్స్‌కు అమ్మిన కాఫీ రైతులకు కిలోకు రూ.8 చొప్పున లాభాలు పంపిణీ చేసింది. గత ఏడాది డీసీసీబీ రూ.6 కోట్ల రుణాలను మాక్స్ సంస్థకు పంపిణీ చేసింది.

ఈ ఏడాది కిలో రూ.36..

ఈ ఏడాది మన్యంలో కాఫీ పండ్లను కిలో రూ.36 ధరలో 662 మెట్రిక్ టన్నులను గిరి రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఎప్పటికప్పుడు పల్పింగ్ ప్రక్రియ పూర్తి చేసింది. 135.25 మెట్రిక్ టన్నుల నాణ్యమైన పాచ్‌మెంట్, 17.60 మెట్రిక్ టన్నుల చెర్రీ రకం కాఫీ గింజలను మాక్స్ సంస్థ బహిరంగ వేలానికి సిద్ధం చేసింది.

వ్యాపారుల పరిశీలన

చింతపల్లి మాక్స్ పల్పింగ్ యూనిట్‌లో వేలానికి సిద్ధం చేసిన కాఫీ గింజలను వ్యాపారులు నాలుగు రోజుల నుంచి పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు పెద్ద వ్యాపారులు రూ.5వేల టెండర్ నగదును చెల్లించారు. పాడేరు కలెక్టరేట్‌లో ఈనెల 3వతేదీ శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ వేలం ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వివరాలకు 7569118491, 9440803572 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

లాభాలు రైతుల ఖాతాల్లో జమ



కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు కాఫీ గింజలకు బహిరంగ వేలం వేస్తున్నాం. నాణ్యమైన కాఫీ గింజలను ఉత్పత్తి చేస్తుండడంతో ఈఏడాది కూడా మంచి ధరతో కొనుగోళ్లు జరిగే పరిస్థితి ఉంది. అమ్మకాలు ద్వారా వచ్చిన లాభాలను బోనస్ రూపంలో ఆయా కాఫీ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తాం.గత ఏడాది కాఫీ పండ్లు కిలోకు రూ.8 చొప్పున బోనస్ కాఫీ రైతులకు పంపిణీ చేశాం.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

ఎస్‌ఐ ప్రిలిమ్స్‌లో గిరి విద్యార్థుల ప్రతిభ



ఎస్‌ఐ ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

- మెయిన్స్‌కు 24 మంది అర్హత
- అభినందించిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: ఎస్‌ఐ పోస్టుల భర్తీకి ఏపీ పోలీసు సెలక్షన్ బోర్డు గత నెల 19న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో గిరిజన అభ్యర్థులు సత్తా చాటారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో సివిల్స్ శిక్షణ పొందుతున్న గిరిజన అభ్యర్థుల్లో 24మంది ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యారు. వీరంతా మెయిన్స్‌కు అర్హత సాధించారు. బి.శ్రీహరినాయుడు, కె.సూర్యప్రకాష్,ఎస్.శ్రీనివాస్, వి.గోపాల్, కె.కరంచంద్, పి.ప్రవీణ్‌కుమార్, ఎస్.సత్తిబాబు, జి.బాలరాజు, సీహెచ్.వెంకటచైతన్య ,కె.చక్రవర్తి, డి.వి.చక్రవర్తి, కె.ప్రభు, ఎ.ఉమాసాయి, ఎస్.సాయికుమార్‌పడాల్, కె.అర్జున్, పి.రాజు, వి.భాస్కర్, ఎల్.లక్ష్మణ్, బి.నవ్య, ఎస్.ఇందిరకుమారి, ఎం.వినీత, ఏవీఎస్.కీర్తి, టి.ఉదయభాను, సీహెచ్.జాహ్నవి ప్రతిభ కనబరిచారు. వీరిని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అభినందించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 21సెంచరి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థ వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో గిరిజన అభ్యర్థులకు సివిల్స్ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే ఇక్కడ శిక్షణ పొందుతున్న వారిలో ఎస్ఎస్‌సీ గ్రాడ్యుయేట్ లెవెల్‌లో 9 మంది, గ్రూప్‌వన్‌లో 12మంది గిరిజన అభ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. సివిల్స్ శిక్షణ కార్యక్రమాలు గిరిజన అభ్యర్థులకు పోటీ పరీక్షలకు ఎంతో దోహదపడుతున్నాయని శిక్షణ సంస్థ నిర్వాహకులు ధరణి తెలిపారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చింతూరు: స్పందనలో స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేతో కలసి ఆయన స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో మన వద్దకు వస్తారన్నారు. అలాంటి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు అందించే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత తొందరగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలవరం నిర్వాసితుల, పోడు భూముల పట్టాల సమస్యలతో పాటు ఇతర సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. బుధవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 42 వినతులు స్వీకరించారు. వీటిలో 10 రెవెన్యూ సమస్యలు, 8 భూ సంబంధిత సమస్యలు, 8 ఉపాధి నిమిత్తం అర్జీలు ఉన్నాయి.

జాతీయ విలువిద్య పోటీకి ఎంపికపై హర్షం



ఆర్చర్ దేశాయ్‌తో కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, సిబ్బంది

అరకులోయ రూరల్ : జాతీయ స్థాయి విలువిద్య క్రీడా పోటీలకు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి దేశాయ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో మూడో స్థానంలో నిలిచి, జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 9న గుజరాత్‌లో జరిగే జాతీయ విలువిద్య పోటీల్లో దేశాయ్ పాల్గొననున్నట్లు తెలిపారు. దేశాయ్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నాగబాబు, కళాశాల పీఈడీ అప్పారావు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణం చూతము రారండి

● శోభాయమానంగా ఉపమాక
● 3 నుంచి ఉపమాక, వడ్డాదిల్లో కల్యాణ మహోత్సవాలు
● నేటి అర్ధరాత్రి అంకురార్పణ



శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామి



ఉపమాకలో ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్లు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం శోభాయమానంగా దర్శనమిస్తోంది. గరుడాద్రి మీద ఏకశిలపై వెలసిన లోకేశుని వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా జరుగుతాయి. 3వ తేదీన జరిగే కల్యాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆలయప్రాంగణాలను ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దారు. ప్రధాన రాజగోపురం నుంచి ఐరన్ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం ఎదురుగా భక్తులు సేదతీరేందుకు షెడ్లు వేశారు. ధ్వజస్తంభం వద్ద టీటీడీ చేసిన ఏర్పాట్లు చూడముచ్చటగా ఉన్నాయి. జయవిజయుల వద్ద నుంచి స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శ్రీనివాసుని బంగారు ఆభరణాలు సబ్‌ట్రెజరీ నుంచి గురువారం తీసుకురానున్నారు. వీటితో అలంకరించి ఆస్థాన మండపంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

నేడు అంకురార్పణ

శుక్రవారం జరిగే స్వామివారి కల్యాణానికి గురువారం అంకురార్పణ చేస్తారు. ఉదయం ఉపమాక మాడవీధుల్లో పెళ్లికావిడను ఊరేగిస్తూ స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనని తెలియజేస్తారు. సాయంత్రం సుదర్శన పెరుమాళ్లను ఉత్తర ఈశాన్య దిక్కుగా ఉన్న ప్రాంతానికి పుట్టమన్ను కోసం తీసుకెళ్తారు. అనంతరం అంకురార్పణ పూజలు నిర్వహించి అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.

సర్వాంగ సుందరంగా వడ్డాది

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 150వ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు, వంశపారంపర్య ధర్మకర్త మండలి సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగుతాయి. గురువారం అర్ధరాత్రి అంకురార్పణ చేస్తారు. స్వామివారి దొంగపెళ్లితో కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి.

ఏటా స్వామి వారి కల్యాణ వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. కల్యాణ ఉత్సవాలకు స్వామి కొలువై ఉన్న గిరిజాంబ కొండను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



రంగులతో ముస్తాబైన ఆలయం

కార్యక్రమాలు ఇలా..

కల్యాణ వేడుకల్లో భాగంగా 3వ తేదీ ఏకాదశి నాడు స్వామివారికి సహస్ర, అష్టోత్తర నామాలతో పూజలు,ఉదయం,సాయంత్రం హోమాలు,గజ,గరుడ వాహనాలపై తిరువీధి ఉత్సవం,రాత్రి 9 గంటలకు స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 4వ తేదీన ప్రత్యేక పూజలు, ఉదయం,సాయంత్రం హోమాలు, వేదపఠనం, 5వ తేదీన సదస్యం, హోమాలు, తిరువీధి ఉత్సవం, 6వ తేదీన స్వామివారికి పూజలు, 7వ తేదీ ఉదయం 9గంటలకు పూర్ణాహుతి, నాగవల్లి వసంతోత్సవం, స్వామివారి తిరువీధి ఉత్సవం, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. 8వ తేదీన రాత్రి 9 గంటలకు స్వామి వారికి పుష్పయాగోత్సవం(పుష్పాంజలి సేవ), పవళింపు సేవ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మ తెలిపారు.

కుంభా రవిబాబుకు అభినందనల వెల్లువ



కుంభా రవిబాబును సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్మన్ స్వాతిరాణి

ముంచంగిపుట్టు: గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ఎన్నికకానున్న ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు అరకు, పాడేరు ప్రజాప్రతినిధులు అభినందించారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో సోమవారం పర్యటించిన కుంభా రవిబాబును జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తూ, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. చట్టసభల్లో గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతపై హర్షం వ్యక్తం చేశారు.

పదవీ విరమణ ఏడీఈకి సత్కారం

మోతుగూడెం: ఏపీ జెన్‌కో విద్యుత్ సంస్థలో సివిల్ ఏడీఈగా పదవీ విరమణ చేసిన రాయన శివకుమార్ అభినందన సన్మాన సభ స్థానిక సివిల్ ఈఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సభకు ఏఈ శివశంకర్ అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న ఎస్ఈ వెంకటేశ్వరరావు, సివిల్ ఈఈ బాబూరావు, డీఈ భీమవరపు బాలకృష్ణ మాట్లాడుతూ శివకుమార్ సేవలను కొనియాడారు. చేసే పని పట్ల అంకిత భావం, విధి నిర్వహణలో నిబద్ధత చూపిన వారు వృత్తిలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అప్పర్ సీలేరు డీఈ లక్ష్మీనారాయణ, డొంకరాయి డీఈ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఏఈ పవన్, ఇంజినీర్లు, యూనియన్ నాయకులు ఆనంద్, కిరణ్, రత్నాకర్, రాజేష్, జెన్‌కో ఉద్యోగులు, కాంట్రాక్టు ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను సన్మానిస్తున్న జెన్‌కో ఇంజినీర్లు, సిబ్బంది

విద్యార్థులకు వైద్య పరీక్షలు

● పాడేరులో మెగా వైద్య శిబిరం
● 620 మందికి సేవలు

పాడేరు రూరల్ : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వైద్య సేవలు పొందారు. కేజీహెచ్‌కు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు, పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 620 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 50 మందికి మూత్ర జననేంద్రియ సంబంధిత వ్యాధులు ఉన్నట్టు గుర్తించారు. వీరిని కేజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు. పాడేరు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, కేజీహెచ్ చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఆంధ్రా వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ జె.భాస్కర్ రెడ్డి, డాక్టర్ జి.హాసంతి. డాక్టర్ నివేత, పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ గౌతమి, కేజీహెచ్ ట్రైబల్ సెల్ కోఆర్డినేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయంతోనే దైవానుగ్రహం

● కంచి కామకోటి పీఠాధిపతి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామీజీ

తుమ్మపాల: సహాయ సహకారాల ద్వారా దైవానుగ్రహం సిద్ధిస్తుందని కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామీజీ అన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో హిందూ సనాతన ధర్మంపై ఆయన బుధవారం ప్రవచించా రు. ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ధర్మకార్యాలు నిర్వహించాలన్నారు. ఇందుకు ధైర్యం, నమ్మకంతో పాటు పరస్పర సహకారం అవసరమని చెప్పా రు. ఆలయ ఆవరణలో గోసంరక్షణతోపాటు జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల య అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, ఆలయ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోయరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఉచిత బియ్యానికి నగదు వసూలు చేస్తే చర్యలు

సాక్షి, పాడేరు : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులకు ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యానికి అక్రమంగా నగదు వసూలు చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని చోట్ల కిలో బియ్యానికి రూపాయి చొప్పున వసూలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఏఎస్‌వోలు, సీఎస్ డీటీలు అప్రమత్తంగా ఉండి, అక్రమ వసూళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో నగదు వసూళ్లపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే బియ్యానికి డిపో నిర్వాహకులు ఎలాంటి నగదు వసూలు చేయవద్దని హెచ్చరించారు. కార్డు దారులు కూడా బియ్యానికి నగదు చెల్లించక్కర్లేదని జేసీ సూచించారు.

ఎలక్ట్రోమాగ్నెటిక్‌తో ఆటోమెటిక్ చార్జ్



ఎలక్ట్రోమాగ్నెటిక్ పరికరం

అనకాపల్లిటౌన్: విద్యుత్‌తో నడిచే వాహనాల కు ఆటోమెటిక్‌గా రీచార్జ్ చేసే ప్రాజెక్టును స్థానిక 'డైట్' కళాశాల విద్యార్థులు రూపొందించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 4వ సంవత్సరం విద్యార్థులు బొద్దపు కుమార్, ఎన్నేటి శ్రీలక్ష్మి, కోటకల తులసి, కాజులూరి తులసి రూపొందించిన ఈఎలక్ట్రోమాగ్నెటిక్ ప్రాజెక్టుద్వారా వాహనం వెళ్తున్నప్పుడు ఆటోమెటిక్‌గా రీచార్జ్ అవుతుంది. ఈ ప్రాజెక్టు తయారీలో కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ పి.పూర్ణప్రియ సహకరించారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం , వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు విద్యార్థులను అభినందించారు.

శభాష్ వలంటీర్

● కాకినాడ వెళ్లి దివ్యాంగురాలికి పింఛను అందజేత

గంగవరం : కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న దివ్యాంగురాలికి గ్రామ వలంటీరు పింఛను అందజేసి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని మోహనాపురం సచివాలయం పరిధి నీలవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు యాట్ల సన్యాసమ్మ (56) మూడు రోజుల క్రితం ప్రమాదానికి గురైంది. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ పెద భవాని 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడ ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను సొమ్ము రూ.2750 అందజేసింది.

తొలిరోజు 75,188 మందికి పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22మండలాల్లోని అన్ని గ్రామాలలోను బుధవారం వేకువజాము నుంచే వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్ము పంపిణీని వలంటీర్లు చేపట్టారు.గ్రామాల్లోని సామాజిక పింఛనుదారులకు ఉదయాన్నే నగదు అందజేశారు. జిల్లాలో తొలిరోజు 60.42 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో 1,24,437 మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.34,65,30,250 కేటాయిస్తోంది. వీరిలో బుధవారం రాత్రి నాటికి 75,188 మందికి పింఛన్లు అందజేశామని డీఆర్‌డీఏ పీడీ మురళి తెలిపారు. కూనవరం మండలంలో అత్యధికంగా 83.71శాతం, వీఆర్‌పురంలో 78.94 శాతం, రంపచోడవరంలో 74.17 శాతం, ఎటపాకలో 71.1, హుకుంపేటలో 70.6 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగిలిన మండలాల్లో 40నుంచి 70 శాతం నమోదైంది.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ



కశింకోట వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న బొగ్గు లారీ

కశింకోట: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్‌ను ఓ లారీ ఢీకొంది. బయ్యవరం నుంచి పరవాడకు బొగ్గు లోడుతో వెళుతున్న టిప్పరును అదే మార్గంలో వస్తున్న మరో లారీ ఢీకొంది. దీంతో బొగ్గు లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగింది.ఎడమ వైపు ముందు భాగం, అద్ద ఒకవైపు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

20 ఎకరాల్లో జీడి తోటలు దగ్ధం

రావికమతం: మండలంలోని సామాలమ్మ పర్వతం సమీపంలోని నేరేడుబంద, ఆజేయపురం గ్రామాల అడవుల్లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గిరిజన రైతులు డిప్పల అప్పారావు,వంతల రామదాసు, ప్రకాష్‌రాజ్,విజయ్‌కుమార్,చిరంజీవి,పాంగి దాసు స్వామి, సూరిబాబులకు చెందిన సుమారు 20 ఎకరాల్లోని జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, చెట్లు బాగా పూతపూయడంతో ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని భావించామని, ఇంతలోనే ప్రమాదం జరిగిందని రైతులు వాపోయారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు.


అగ్నికి ఆహుతైన సరుగుడు, జీడి, టేకు చెట్లు

మునగపాక: మండలంలోని కాకరాపల్లిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో టేకు, జీడి, సరుగుడు తోటలు కాలిబూడిదయ్యాయి. రెండున్నర ఎకరాలకు సంబంధించి రూ.2లక్షల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాకరాపల్లికి చెందిన కాకర త్రినాథరావు, ఇల్లా పోతురాజు సరుగుడు, జీడి, టేకు చెట్ల పెంపకం చేపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కాగా రూ.2లక్షల మేర నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఇసుక లారీ సీజ్

చోడవరం రూరల్: మండలంలోని ముద్దుర్తి గ్రామ జంక్షన్ వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ ఎన్.వి.రమణ తెలిపారు. ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీను బుధవారం లారీతో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. లారీని చోడవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువకుడి హత్య కేసులో మేనమామ అరెస్టు



యలమంచిలి సీఐ గఫూర్

మునగపాక: మండలంలోని గణపర్తిలో జరిగిన యువకుడి హత్యకేసులో మేనమామను బుధవారం అరెస్టు చేసినట్టు యలమంచిలి సీఐ గఫూర్ తెలిపారు. గణపర్తిలో మంగళవారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. నర్సీపట్నానికి చెందిన గాలి శ్రీను, అతని మేనల్లుడు భీమిరెడ్డి లోవరాజు పరవాడ మండలం తానాంలో నివాసం ఉంటూ మునగపాక మండలం గణపర్తి సచివాలయ సమీపంలో చికెన్ షాపు నిర్వహిస్తున్నారు. లోవరాజు తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ శ్రీను వద్దే పెరిగాడు. ఆరు నెలలుగా లోవరాజు మద్యానికి బానిసై మాంసం దుకాణంలోని నగదు తీసుకుపోవడం, బాధ్యత లేకుండా ప్రవర్తించడం వంటి అంశాలపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. అయినప్పటికీ లోవరాజులో మార్పు రాకపోవడంతో విసుగుచెందిన శ్రీను ఎలాగైనా చంపేయాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి ఇరువురి మధ్య మళ్లీ వివాదం తలెత్తడంతో సహించలేని శ్రీను తన మేనల్లుడు లోవరాజు తలను కత్తితో నరికి వేశాడు. తల భాగాన్ని గోనె సంచిలో పెట్టి షాపులోనే ఉంచాడు. మొండెం భాగాన్ని అక్కడే పెట్రోల్‌తో కాల్చి వేశాడు. ఈ సమయంలో దుర్వాసన, పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అనుమానం వచ్చి చికెన్ షాపులోకి వెళ్లి చూసి నివ్వెరపోయి, పోలీసులకు ఫోన్ ద్వారా తెలిపారు.అప్పటికే సంఘటనా స్థలం నుంచి శ్రీను పారిపోతుండగా అరెస్టు చేసినట్టు సీఐ గఫూర్ తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ చెప్పారు.

మాట తప్పని నేత

పెన్షన్ లేని మహిళకు సొంత నగదుతో పింఛన్ సొమ్ము అందజేసిన డిప్యూటీ సీఎం బూడి



వరహాలమ్మకు పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ

కె.కోటపాడు: చౌడువాడలో గత నెల 9న నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామానికి చెందిన చిన్ని వరహాలమ్మ ఆర్థిక ఇబ్బందులను స్వయంగా విన్నారు. వృద్ధురాలైన తల్లి సన్నమ్మ (85)తో కలిసి జీవిస్తున్నట్లు వరహాలమ్మ తెలిపింది. ఎవరి ఆసరా లేదని.. తల్లిని తానే స్వయంగా చూసుకుంటున్నట్లు వివరించింది. వివాహం చేసుకోకపోవడం.. తన వయస్సు 50 ఏళ్లు నిండకపోవడంతో ఒంటరి మహిళ పెన్షన్‌కు కూడా అర్హత లేదని వాపోయింది. తల్లికి వస్తున్న పెన్షన్‌తోనే జీవనం గడుపుతున్నట్లు వివరించింది. వరహాలమ్మ ఆర్థిక ఇబ్బందులు గుర్తించిన డిప్యూటీ సీఎం చలించిపోయారు. ప్రతినెలా 1వ తేదీనే సొంత నగదు రూ.2750 ఇంటికే నేరుగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. అన్న మాట ప్రకారం చౌడువాడలో వరహాలమ్మ ఇంటికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.2750 నగదును ఆయన కుమార్తె, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ చేతుల మీదుగా అందించారు. ఆయన ఔదార్యానికి వరహాలమ్మ, ఆమె తల్లి సన్నమ్మలతో పాటు గ్రామస్తులు కూడా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వార్డు మెంబర్ చల్లా సురేష్, మిర్తిపాటి నాగేశ్వరరావు, ఆకుల సాయిప్రసాద్ పాల్గొన్నారు.

త్వరితగతిన లక్ష్యం పూర్తి



మాట్లాడుతున్న పీడీ రమేష్‌రామన్

చింతూరు: నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయి సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలని డ్వామా పీడీ రమేష్ రామన్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది పనులు సక్రమంగా, త్వరితగతిన జరిగేలా పరిశీలన చేయాలని ఆదేశించారు. అర్హులందరికీ వందరోజుల పనిదినాలు కల్పించాలని, యాప్‌లో ప్రతిరోజు కూలీల హాజరు పొందుపరచాలని ఆయన సూచించారు. ఆధార్ నమోదుతో పాటు చెల్లింపులు ఆగిపోయిన కారణాలు తెలుసుకుని వాటిని పరిష్కరించి కూలీలకు సొమ్ములు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఉద్యానవన తోటల పెంపకానికి సంబంధించి బతికి ఉన్న మొక్కలను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి వాటికి సంబంధించిన కూలి సొమ్ములను లబ్ధిదారులకు చెల్లించాలని ఆదేశించారు. అమృత్ సరోవర్‌లో భాగంగా చిన్నతరహా సాగునీటి చెరువుల పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలు సాంకేతిక సమస్యలపై టెక్నికల్ అసిస్టెంట్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రోశయ్య, ఎంపీడీవో రవిబాబు, ఏపీవో అప్పలరాజు, నాలుగు మండలాల ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

● అరుణవర్ణ శోభితం.. రైవాడ జలాశయం



దేవరాపల్లి: అరుణిమ సూరీడు తనను తాను చూసుకుంటున్నట్లు రైవాడ జలాశయంలో మనోహరంగా సాక్షాత్కరించాడు. భానుడి ఆగమనంతో రైవాడ పరిసరాలు ఒక్కసారిగా శోభాయమానమయ్యాయి. కనులపండువైన ఈ దృశ్యం బుధవారం 'సాక్షి' కెమెరా కంటికి చిక్కింది.